: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 49 | 20-09-2021 | పుటలు : 4

## అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను పెంచాలి



### ఐఐటీ ఢిల్లీ సంచాలకులు ఆచార్య రాంగోపాల్ రావు

**18.09.21 (మీడియాసెల్)** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాలుగా మార్పు చెందాల్సిన అవసరం ఉందని ఐఐటి ఢిల్లీ సంచాలకులు ఆచార్య రాంగోపాల రావు అన్నారు. శనివారం ఉదయం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఏపి ఉన్నత విద్య ప్రణాళిక బోర్డు రెండవ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన వర్చువల్ విధానంలో హాజరై ప్రసంగించారు.

సదస్సుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ - విశాఖపట్నం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపిఈ ) సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చాయి. ఈ సందర్భంగా ఆచార్య రాంగోపాల్ మాట్లాడుతూ జ్ఞానాన్ని సంపదగా మలచుకునే ప్రయత్నం జరగాల్సి ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని గ్లోబల్ సిటిజన్ గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్య వ్యాపారం కాకూడదనే ఉద్దేశంతో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, కాలేజ్ యేట్ ఎడ్యుకేషన్ కమీషనర్ డాక్టర్ పోల భాస్కర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ఆచార్య కె.రామ మోహన రావు, ఆచార్య టి.లక్ష్మమ్మ, కార్యదర్శి ఆచార్య బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు . అనంతరం క్లస్టర్ల వారీగా విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశం నిర్వహించారు.



## వీసీల సదస్సుకు జగన్నాథరావు హాజరు

**18.09.21 (మీడియాసెల్)** విశాఖపట్నంలో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యా సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి అవంతి శ్రీనివాసరావు, ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్ రాంగోపాలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉప కులపతులు హాజరయ్యారు. ఈ సదస్సుకు హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య విస్తరణ , నాణ్యత , సమానత్వం అనే అంశంపై' సదస్సు జరిగిందన్నారు. ఉన్నత విద్యకు సంబంధించిన కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించడం జరిగిందని, రాష్ట్ర ఉన్నత విద్యకు సంబంధించిన అధికారులందరూ సదస్సులో పాల్గొన్నారని చెప్పారు.




ప్రత్యేక అతిథి బి.సుధాకర్ బాబు

## ఇంజనీర్స్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**15.09.21 (మీడియాసెల్)** దేశాభివృద్ధిలో ఇంజనీర్లు పాత్ర ఎంతో కీలకమని,దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇంజనీర్స్ కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఇంజనీర్స్ డే ను పురస్కరించుకొని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో బుధవారం అద్వికౖ2కె21 ఫెస్ట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ప్రత్యేక అతిథిగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్ బాబు హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ చాలాకాలంగా ఎదురుచూస్తున్న ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపును ఈ ఏడాది సాధించామని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంతో భవిష్యత్ ఉందని నూతన ఆవిష్కరణలతో సమాజ హితంగా ఇంజనీర్లు పని చేయాలన్నారు.దేశ భవిష్యత్ మేధావులైన ఇంజనీర్లు చేతుల్లో ఉంటుందని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలను సమాజంలో అన్వయించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. భారతదేశంలో యువ ఇంజనీర్ల మేథస్సులో నుండి ఉద్భవించిన ఆవిష్కరణలకు రూపాన్ని ఇచ్చి పేటెంట్లు సంపాదించాలన్నారు. అన్ని రంగాలపై ఇంజనీరింగ్ విద్యార్థులకు పట్టు ఉండాలని,అన్ని రంగాలను సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయాలని తెలిపారు. అభివృద్ధి పేరుతోఇంజనీర్లు చేస్తున్న ప్రయత్నాలు సమాజ హితంగా, పర్యావరణ హితంగా ఉండాలని తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు భవిష్యత్ లో సృజనాత్మక ఆలోచనలతో దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్ట్ చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్ బాబు మాట్లాడుతూమోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ అర్థర్ కాటన్ వంటి గొప్ప ఇంజనీర్లు

మిగతా 2లో



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్నవీసీ, సీఈ

## సంపాదకీయం



# ప్లీజ్... కొంత సమయం..

సమయం, సంభాషణ, స్పర్శ, నమ్మకం.. ఇవే.. ఈ నాలుగు పదాల ఆచరణవల్లే మీ పిల్లలు మిమ్మల్ని ప్రేమిస్తారు. మీరు మీ పిల్లలకు సమయం కేటాయించకపోతే వాళ్ళు వేరే వాళ్లకు సమయం కేటాయిస్తారు. మీరు మాట్లాడకపోతే మాట్లాడే వాళ్లను వెతుక్కుంటారు. మీ స్పర్శను కోల్పోతే కొత్త స్పర్శను కోరుకుంటారు. మీ నమ్మకాన్ని కోల్పోతే పరాయి వాళ్ళను నమ్ముతారు. మీరు ప్రేమించకపోతే వేరే వాళ్ల దగ్గర ఆ ప్రేమను పొందుతారు. ఇవన్నీ నిజాలు. నిజాలు ఎప్పుడు చేదుగానే ఉంటాయి. బాధగా కూడా ఉంటాయి. కాసేపు పిల్లలతో గడపండి.మాట్లాడండి. పిల్లల దగ్గర సంభాషణలో మీ మాటల్లో టీవీలోని వినోదం ఉండాలి. వారితో మీ సంభాషణ సోషల్ మీడియాలోని హుషారు కనిపించాలి. మీ పలకరింపులో స్నేహం, మాధుర్యం, ఆప్యాయత మీ కబుర్లలో విజ్ఞానం ఉంటే అటువంటి తల్లిదండ్రులు పిల్లల గురించి భయపడాల్సిన పనిలేదు.

ఓ పబ్లిక్ స్కూల్లో "మీరు ఎలా పుట్టి ఉంటే బాగుండునని మీరనుకుంటున్నారనే" అంశం మీద వ్యాసరచన పెట్టారో మాస్టారు. రకరకాలుగా రాశారు పిల్లలు.ఒక వ్యాసం మాత్రం భిన్నంగా ఇలా ఉంది. "సెల్ ఫోన్ లా పుట్టి ఉంటే బాగుండునని చాలాసార్లు అనిపిస్తుంది. నిద్ర లేచింది మొదలు పడుకునే దాకా మా నాన్న, అమ్మా సెల్ ఫోన్లో మాట్లాడుతూనే ఉంటారు. నాతో కాసేపు మాట్లాడితే బాగుండునని చాలా సార్లు ఎదురు చూశాను.అలా జరగలేదు. అమ్మా నాన్న చేతుల్లోనే ఎప్పుడూ ఉండేలా సెల్ఫోన్ లా పుడితే బాగుండుననిపిస్తుంది..." ఇలా సాగిందా వ్యాసం.ఆ పిల్లవాడికి ఏ లోటూలేదు. కరువైందల్లా కాసిని మాటలే!!

ఇంటి నిండా సౌకర్యాలున్నా, కోరినవన్నీ కొనుక్కునే స్వేచ్ఛ ఉన్నా, తనతో అమ్మానాన్నలు సమయం గడపలేని, నోరారా మాట్లాడలేని పరిస్థితులే పిల్లల్ని తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్న అంశాలు. ఓ సుదీర్ఘమైన ఫోన్ కాల్ కు కేటాయించిన సమయాన్ని పిల్లల కోసం పక్కన తీసి పెట్టకపోతే మన ఒంట్లో నుంచి ఇంట్లోకి ఎందుకు వాళ్లు పుట్టారో వాళ్ళకే అర్థం కాదు. ఎదిగే క్రమంలోని ఆలోచనల్లో, వ్యక్తిత్వంలో చిన్న చిన్న తేడాలు సరిదిద్దటానికి ఇష్టాయిష్టాల అభిరుచులు అర్థంకావటానికి మాటలవల్లే పిల్లలతో దగ్గరితనం పెరుగుతుంది. నిజాయితీగా మాట్లాడితే పిల్లలు నిజాయితీపరులు అవుతారు. ఎదుటి మనిషి మీద ప్రేమ, సమాజం మీద గౌరవం, విలువల పట్ల విశ్వాసం... ఇవి కచ్చితంగా తల్లిదండ్రుల నుంచి సంక్రమించేవే.

మీరు సమయాన్ని కేటాయించి చూడండి.పిల్లల మనసుల్లోని భావాల్ని,ఆలోచనల్ని, భయాల్ని, బాధల్ని పంచుకోవటానికి సాక్షాత్తు తల్లిదండ్రులే సిద్ధంగా ఉంటే ముక్కు మొహం తెలియని ఫేస్బుక్ ఫ్రెండ్స్ తో వాళ్లకు పనేంటి? కుటుంబంతో గడపలేని,వెనక్కి తిరిగి చూడలేనంత పరుగులో, వేగంలో, హోదాల్లో, సంపాదనలో మీరు ఉంటే కనుక, పిల్లలు మిమ్మల్ని చేరుకోలేక అలా దూరంగా నిలబడి చూస్తారంతే!... ఇంక అంతే!!

## ఇంజనీర్స్ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

(మొదటి పేజీ నుంచి) భారతదేశానికి విశేష సేవలందించారని కొనియాడారు. దేశంలోనే గొప్ప ప్రోజెక్టుగా పోలవరం ప్రోజెక్టు రూపొందించ బడుతుందని జూన్ 2022 నాటికి పోలవరాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు.నేటి ఇంజనీరింగ్ రంగంలోనే ఒక మైలురాయిగా నిర్మాణ మవుతున్న పోలవరం ప్రోజెక్టును ప్రతీ ఇంజనీర్ సందర్శిం చాలని తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థులంతా ఫీల్డ్ విజిట్ గా పోలవరం ప్రోజెక్టును వీక్షించి నూతన విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఆశించిన లక్ష్యాలను సాధిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అద్విక2కె21లో భాగంగా ఇంజనీరింగ్ క్లబ్స్ వారిచే రెండు రోజులలునిర్వహించిన క్విజ్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, ప్రోజెక్ట్ ఎక్స్పో, ట్రెజర్ హంట్, వక్తృత్వం వంటి టెక్నికల్ఈవెంట్స్లో విజేతలైన విద్యార్థులకు అతిథుల చేతుల మీదిగా జ్ఞాపికలను, సర్టిఫికెట్లును అదించారు. అద్విక ఆధ్వర్యంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ప్రత్యేక అతిథి పోలవరం ఇరిగేషన్ ప్రోజెక్ట్ చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్ బాబును సన్మానించి అభినందించారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రోజెక్టులను, పోస్టర్ ప్రెజెంటేషన్లును వీసీ,సిఈ పరిశీలించి విద్యార్థులకు శుభాకాక్షలను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, కన్వీనర్ ఎ.విజయదుర్గ,కోర్సు కోఆర్డినేటర్లు ఎం.బాలకృష్ణ, జె.హనుమంతు, బి.లక్ష్మీ, సి.హెచ్.శ్రీవర్మ, కోకన్వీనర్లు డా.వెంకట్రావు, ఎన్.రాహుల్ పాల్, బి.యానీకెజియా, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.






ప్రోజెక్టులను పరిశీలిస్తున్న వీసీ, సీఈ





కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డా.ఎమ్.కమలకుమారి, అతిథి డా.నూకరత్నం మరియు అధ్యాపకులు.

## మేఘాలలో... తేలిపొమ్మన్నది!!











ఫొటోలు : గణేష్ , ఎమ్మెస్సీ మ్యాథ్స్



యూనివర్సిటీలో మేఘం - మైదానం

ఫోటో: వై.కీర్తన, ఈ.ఐ. ఈ.


## చిన్నారిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**కాకినాడ క్యాంపస్**

18.09.21 (మీడియాసెల్) ఇటీవల తెలంగాణాలో 6 సంవత్సరాల చిన్నారిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా "ఈ అకృత్యాలకు అంతం లేదా ? ", పసలేని చట్టాలే మాకు శాపాలు . " " ఆడపిల్లగా పుట్టడమే పాపమా ?" అంటూ నినాదాలతో దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ కాకినాడ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రత్యేక అధికారి డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను చట్టాల ద్వారా పరిరక్షించి, త్వరితగతిని వారిని శిక్షించాలని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశమంతా ప్రతి ఆడపిల్లను రక్షించే చట్టాలు అమలులోకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.మధుకుమార్ , శ్రీనివాస్, మనోజ్, స్టీఫెన్, సత్యనారాయణ, రాధ మాధవి , విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం





ఆజాను బాహులారా! ఓజోను పొరను రక్షించండి!!




## ప్రతిభా వాణి

## విశ్వనాథ సత్యనారాయణ

**1895 - 1976**



విశ్వనాథ సత్యనారాయణ గారు శ్రీమతి పార్వతమ్మ, శ్రీ శోభనాద్రి దంపతులకు కృష్ణాజిల్లాలోని ఆనాటి గన్నవరం తాలూకా నందమూరు గ్రామంలో జన్మించారు. విశ్వనాథ బాల్యం నందమూరులో గడిచింది. నోబెల్ హైస్కూల్ అధ్యాపకులు మహనీయులు శ్రీ కానుకొలను త్రివిక్రమ రామారావు గారి వద్ద సంస్కృత కావ్యాలు,వేదాంత గ్రంథాలు అధ్యయనం చేశారు. భారతీయ సంస్కృతి,విజ్ఞానం గురించి వారి సప్రమాణ ప్రబోధం విశ్వనాథలో ఆత్మవిశ్వాసంతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడింది. జాతీయ కళాశాలలో పనిచేసే రోజుల్లో కళాశాల అధ్యక్షులు కోపల్లె హనుమంతరావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు ప్రమోద్ కుమార్ ఛటర్జీ, అడవి బాపిరాజు మొదలైనవారితో సాన్నిహిత్యం ఏర్పడింది. సాహితీవేత్త, పరిపాలనాదక్షుడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, పత్రికా సంపాదకులు శ్రీ శివలెంక శంభుప్రసాద్ వంటి ప్రముఖులు పలువురు జాతీయ కళాశాలలో విశ్వనాథ వారి శిష్యులు.

1977లో కోలవెన్ను రామకోటేశ్వర రావుతో కలసి తెలుగులో 'జయంతి' ఇంగ్లీషులో 'త్రివేణి' పత్రికలను స్థాపించారు. బందరు హిందూ కళాశాల ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. తర్వాత గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో అధ్యాపకునిగా చేరారు. 1934లో రచింపబడిన 'వేయిపడగలు' నవల రచన కేవలం 28 రోజుల్లో డిక్టేషన్ పద్ధతిలో జరగటం ఒక అద్భుతం. విశ్వనాథ ప్రతిభా పాండిత్యాలను,రచనా శిల్పాన్ని వేయి ముఖాలుగా ప్రతిబింబించిన 'వేయిపడగలు' ఆంధ్ర విద్యాలయ బహుమానం అందుకున్న సందర్భంలోనే శ్రీ భావరాజు నరసింహారావు 'కవిసమ్రాట్'గా విశ్వనాథను కీర్తించారు. 1957లో నూతనంగా నెలకొల్పబడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీకి విశ్వనాథవారు ప్రప్రథమ ఉపాధ్యక్షులయ్యారు. కరీంనగర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 1964 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది. 1970లో కేంద్ర ప్రభుత్వం 'పద్మభూషణ్'తో సత్కరించింది. పీ.వీ.నరసింహారావు గారు 'వేయిపడగలు' నవలను 'సహస్రఫణ్ ' పేరుతో హిందీలో అనువదించారు. విశ్వనాథ వారికి 1971 నవంబర్ 16న ఢిల్లీ నగరంలో జ్ఞానపీఠ పారితోషకం పురస్కార ప్రదానం జరిగింది. ప్రపంచ ప్రసిద్ధిని పొంది తెలుగు భాష బ్రతికి ఉన్నంత వరకు బ్రతికి ఉండే 12 వేల పద్యాల మహాకావ్యం "శ్రీమద్రామాయణ కల్పవృక్షం" తెలుగుదనం ఉట్టిపడే విధంగా వ్యవహారభాషలో రచింపబడిన జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న కల్ప వృక్షం నిజంగా భావుకుల పాలిటి కల్పవృక్షమే.

సాహితీ విరాట్ స్వరూపమైన విశ్వనాథ వారికి నన్నయవాణి అక్షర నీరాజనాన్ని సమర్పిస్తోంది.

# ఉపకులపతి ఉవాచ



స్త్రీలోకం తమ జీవితాల్లో గొప్ప ఆదర్శాలను సాధించాలని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, కోరుకున్న లక్ష్యాలను సాధించాలని అనుకుంటారు. వారికి తక్కిన సమాజం అండగా నిలబడాలి. రక్షణ కవచం అవ్వాలి. మహిళల అభివృద్ధికి అడ్డుపడే అవరోధాలను దాటి ముందుకు వెళ్ళటానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తీసుకు వచ్చాయి.రక్షణనివ్వటానికి అందుబాటులో ఉంటున్నాయి. అలా ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసినదే దిశ యాప్.

మిమ్మల్ని వెంటాడే, ఆటంకపరిచే ఏ అరాచక శక్తుల నుండి అయినా ఈ మొబైల్ యాప్ ద్వారా సత్వరమే రక్షణ పొందవచ్చు.వెంటనే దిశ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలియజేస్తున్నాను.

మొక్కా జగన్నాథరావు

# ఇంటర్నెట్ సేవలను సద్వినియోగం చేసుకోండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**17.09.21 (మీడియాసెల్)** విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ మరియు గర్ల్స్ హాస్టల్స్ లో శుక్రవారం వీసీ ఆచార్య జగన్నాథరావు విద్యార్థులతో కలిసి వైఫై ఇంటర్నెట్ సేవలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి విద్యార్థులే ప్రాధాన్యమని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రత్యేక స్టడీ రూమ్ లను ఏర్పాటు చేశామని, అలాగే ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్ సేవలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవా లన్నారు. హాస్టల్స్ లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వార్డెన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్స్ లో వైఫై ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించామని, త్వరలో క్యాంపస్ లోని అన్ని ప్రాంతాల్లో వైఫై ఇంటర్నెట్ సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి ఇంటర్నెట్ వైఫై సదుపాయాన్ని కల్పించిన వీసీకి విద్యార్థులు కృతజ్ఞతతో శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆచార్య ఎస్.టేకి, డా.బి.జగన్మోహన్ రెడ్డి, డా.బి.కెజియారాణి, డా.పి.విజయనిర్మల, డా.నూకరత్నం, డా.కె.సుబ్బారావు వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి వైఫై ఇంటర్నెట్ సేవలను ప్రారంభిస్తున్న వీసీ



# 21న నన్నయ 100వ వెబినార్

**18.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 100 వ వెబినార్ బ్రోచర్ ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. అశోక్ విడుదల చేసారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ "ఉన్నత విద్యార్థులు ఎదురుకోంటున్న సవాళ్లు వాటిని అదిగమించడానికి కావలిసిన మానసిక, సాంఘిక దృక్పథం" అనే అంశంపై నన్నయ విశ్వవిద్యాలయం సైకాలజీ డిపార్ట్మెంట్ మరియు స్పృహ సైకాలజీ పూర్వవిద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 21వ తేది ఉదయం 10.30 గంటలకు వెబినార్ నిర్వహిస్తున్నారని అన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఈ 100వ వెబినార్ లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ వెబినార్ కు ముఖ్య అతిధిగా వైస్ ఛాన్సెలర్ ఆచార్య మొక్కా జగన్నాథరావు, కీలకోపన్యాసకులుగా ప్రముఖ విద్యా వేత్త, సైకియాట్రిస్ట్ డాక్టర్ కర్రి రామారెడ్డి, క్రీడాపరిశోధకులు, స్పృహ అధ్యక్షులు సుంకర నాగేంద్ర .కిషోర్, విద్యార్థులు.... "సరిలేరు మీకెవ్వరు" -తమలో ఇమిడి ఉన్న శక్తి, సామర్థ్యంలను వెలికి తీసుకోగలరు," అనే చైతన్య అంశం పై ప్రసంగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. టెకీ, సైకాలజీ కోర్స్ కోఆర్డినేటర్ డా.పడాల రాజశేఖర్, డా.కృష్ణ భవాని, డా.నారాయణ నక్కిన, స్పృహ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిశోర్, సైకాలజిస్ట్ లు గాదె కిషోర్, శ్రావణి జ్యోత్స్న, వెబ్ మాస్టర్ ఎం. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ అశోక్

# పరిశోధనలతో నన్నయ ఖ్యాతి పెంచాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**16.09.21 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని మరింత పెంచే విధంగా మెరుగైన పరిశోధనలు చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం ఫుల్ టైం రీసెర్చ్ స్కాలర్స్, గైడ్ లతో వీసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు అంశాలను చర్చించారు. నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఉపకులపతి పరిశోధనా విద్యార్థులు, మార్గదర్శకులతో సమీక్ష నిర్వహించి మార్గనిర్దేశం చేశారు. ఒక్కొక్క విద్యార్థితో వీసీ ప్రత్యేకంగా మాట్లాడి, వారు చేస్తున్న పరిశోధన అంశం, దానిలోని పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఆయా పరిశోధనలు లకు సంబంధించిన ప్రశ్నలను అడిగి స్కాలర్స్ పరిశోధనా స్థాయిని గమనించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యా ప్రగతిని నాణ్యమైన పరిశోధనల ద్వారా పెంచాలని చెప్పారు. మెరుగైన పరిశోధనలు, సమాజహితమైన పరిశోధనలు విశ్వవిద్యాలయం నుండి రావాలన్నారు. పరిశోధనా విద్యార్థులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను గైడ్ లు అందించాలని సూచించారు. విద్యార్థుల ఉన్నతికి నాణ్యమైన పరిశోధనలకు చక్కని మార్గనిర్దేశనం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య ఎస్.టేకి, ఆచార్య.పి.సురేష్ వర్మ, ఆచార్య.వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు.

# లైఫ్ సైన్స్ విద్యార్థుల ఫేర్ వెల్











ఎక్కడో పుట్టి
ఎక్కడో పెరిగి
ఇక్కడే కలిసాము..
చదువులమ్మ
చెట్టు నీడలో
వీడలేమంటు ..
వీడుకోలంటు
వెళ్ళిపోతున్నాము..





## APPGCET-2021
### Post Graduate Common Entrance Tests
(Conducted by Yogi Vemana University, Kadapa on behalf of APSCHE)

APSCHE

## NOTIFICATION

**Online Applications** are invited from the candidates who have passed or appearing for the final semester (year) examination in the qualifying degree for entrance tests and admission into first year of various P.G. Courses (M.A., M.Com., M.Sc., MCJ, M.Lib.Sc., M.Ed., M.P.Ed., M.Sc.Tech etc) offered by Andhra Pradesh State funded Universites and their Constituent/Affiliated [Government and Private (Aided/Unaided)] Colleges including Minority Educational Institutions in the State. The Entrance test will be conducted online through Computer Based Test (CBT). For further details, go through the Information Brochure available in the websites: **www.yogivemanauniversity.ac.in** (or) **www.yvu.edu.in** (or) **https://sche.ap.gov.in**.

**Registration Fee** for a single subject is **Rs.850/- for OC**, **Rs.750/- for BC** candidates and **Rs.650/- for SC/ST/PH** candidates. The fee may be paid at any APonline centers or through payment gateway (Credit/Debit Cards/ Net Banking). For submission of online application, visit the above websites.


**IMPORTANT DATES**

| | | |
|---|---|---|
| Date of commencement of online registration & Submission of applications | : | 15.09.2021 |
| Last date for submitting the online application | : | 30.09.2021 |
| Last date with a late fee of Rs.200/- | : | 04.10.2021 |
| Last date with a late fee of Rs.500/- | : | 08.10.2021 |
| Commencement of Entrance tests tentatively from | : | 22.10.2021 |

Date: 15.09.2021
Place: Kadapa

Sd/- Prof. Y. NAZEER AHAMMED
Convener, APPGCET-2021, YV University


ఒక చోట ఒక పెద్ద ప్రాజెక్టు కడుతున్నారు. ఒక పెద్ద బండరాయిని తొలగించడానికి నలుగురు కూలీలు కష్టపడుతున్నారు. ఆ రాయిని కదల్చడం వారి వల్ల కావడం లేదు. పక్కనే బీడీలు తాగుతూ ఇంకొక వ్యక్తి, " ఊ... తొయ్యండి... గట్టిగా తొయ్యండి" అంటూ పురమాయిస్తున్నాడు. పక్కనుండి పోతున్న ఒక పెద్ద మనిషి, " ఊరికే అలా అరవకపోతే కొంచెం సహాయం చెయ్యొచ్చుగా" అన్నాడు.



దానికా బీడీలు తాగుతున్న వ్యక్తి చిద్విలాసంగా "నేను సూపర్ వైజర్ను. అది నా పని కాదు." అంటూ జవాబిచ్చాడు.

బండరాయిని తొలగించడానికి ఆ పెద్దమనిషి కూలీలకు సహాయం చేసి, సూపర్ వైజర్ తో, "నా పేరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఈ ప్రాజెక్టుకు చీఫ్ ఇంజనీర్ ను, నీకెప్పుడైనా ఇటువంటి అవసరం వస్తే నిరభ్యంతరంగా పిలు, సహకరిస్తాను. అని వెళ్ళబోయాడు.

సూపర్ వైజర్ విశ్వేశ్వరయ్య గారి కాళ్ళ మీద పడి క్షమించమని వేడుకున్నాడు.


[ సేకరణ - VVS Prasad]

102 సంవత్సరాలు జీవించిన సర్. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు ప్రపంచం గర్వించేంత గొప్ప ఇంజనీరు. హైదరాబాద్ నిజాంకు కూడా ఆయన సలహాదారుగా పనిచేసిన మహోన్నతమైన వ్యక్తి.

## మంచి మాట

మేధావి ఒక శాతం
పుట్టుకతో వచ్చిన
ప్రేరణతోనూ,
తొంభైతొమ్మిది శాతం
చెమటోడ్చి పనిచేయటం
ద్వారానూ
తయారవుతాడు.

- థామస్ అల్వా ఎడిసన్



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in